నిపుణుల సలహాలు:

# కే. డీ. నంబర్ వన్

"అంగారకుడు"

ఈ మధ్య మా 'విశ్వరూపం' సంపాదకుడుగారు నాకు ఒక చిన్న పని తగిలించాడు. నాలుగేళ్ళకిందట దేశమంతటినీ మారుమోగించిన కోటయపాలెం దోపిడికేసునాయకుడు, రాములు ఆ వేళే విడుదల అవుతున్నాడు. అతడు మళ్ళీ అంతర్ధానమయే ముందే కలుసుకుని ఒక ఇంటర్వ్యూ ప్రకటిస్తే బాగా ఉంటుందని ఆయన అభిప్రాయపడి, ఆ పని నాకు పురమాయించాడు.

అధికారులను విచారించి, విడుదల జరిగే సమయానికి జైలుకి ఎదురుగా ఉన్న చెట్ల క్రింద పచారు చేస్తున్నాను. టైము కాంగానే బయటికి వచ్చాడు రాములు, గేటుదగ్గరి పోలీసులతో పరాచికాలాడుతూ.

అతను ఇవతలికి రాంగానే దగ్గరికి వెళ్ళి "మీతో కొంచం మాట్లాడాలి. అటు వస్తారా?" అని అడిగాను.

రాములు నన్ను ఎగాదిగా చూసి "ఏం బాబూ! ఏ కేసులో ఇరికించి నన్ను మళ్ళీ జైలుకి పంపాలని చూస్తున్నావ్?" అని అడిగాడు.

"అబ్బెబ్బే! అట్లాంటి దేమీ కాదులెండి, రాములుగారూ! విశ్వరూపంపత్రిక పేరు విన్నారు కాదూ?"

"ఆ, సదువుతునే ఉంటాను లెండి."

"నేను ఆ పత్రిక్కి విలేఖరిని. మీకు తెలుసుగా, కోటయపాలెంకేసులో మీ పేరు దేశమంతా మారుమోగిందని. ఇప్పుడు మీరు ఘరానానాయకులతో సమానమైనారు. అందుకని మిమ్మల్ని కలుసుకుని మీరు చెప్పిన నాలుగు ముక్కల్ని ప్రకటిద్దామని వచ్చాను."

"ఓహో! అదా సంగతి?"

*　　*　　*　　*

వాల్టాక్స్‌రోడ్డు కాఫీహోటల్లో అవశిష్టాలు ముగించుకుని, మోర్ మార్కెట్ పక్కనవున్న పచ్చికమీద చతికిలపడ్డాము.

"అయితే, ఇంతకూ మీకు కావలసింది యేంటండీ?" అన్నాడు రాములు.

"ఏవో మీ అనుభవాలూ, ఆలోచనలూ చెప్పండి. అసలు మీరీ పనిలో ఎందుకు దిగారు?"

"మాది రెక్కలు విరుసుకుని బతికే సంసారం. మా అమ్మకు గంపెడుమంది పిల్లలు. అంతా యేదో గాలికి బతికేవోళ్ళం. నేను కార్లస్టాండుదగ్గర సామాన్లు మోసేవోణ్ణి. అప్పుడు నాకు దొంగతన మంటే అసయ్యంగా ఉండేది."

"మరి దాన్నెందుకు వొదిలేశారు?"

"మావూరి యూనియన్‌కి ఒక తలతిక్కాయన ప్రెసిడెంటుగా వొచ్చాడు. తన ప్రెసిడెంట్‌గిరీకి గుర్తుగా యేదయినా చెయ్యాలనుకునేవాడు. సివరకి కూలీలందరికీ లైసెన్సుపద్ధతి పెట్టించాడు. జబ్బుపడ్డ మూలాన దాన్ని తెచ్చుకోలేకపొయ్యాను. అప్పుడు ఒకవీధి మిటాయికొట్టాయన్ని బతిమలాడుకుంటే, ఆయన మసాలాగారెలు, పునుగులు అమ్మేపని ఇచ్చాడు. పార్కులో వాటిని అమ్ముకుంటూ కొన్నాళ్లు బండి యీడిచాను."

"ఉఁహూఁ"

"కాని మావూళ్ళో మార్వాడీ హోటల్ షావుకారికి కూడ పార్కులో మిటాయి బేరాన్ని నడపాలని బుద్ధిపుట్టింది. పార్కులో కొట్టుపెట్టటానికి లైసెన్సు తీసుకున్నాడు. అయినా మేము అక్కడక్కడ తిరిగిఅమ్ముకునేవోళ్ళం. ఇది చూసి వాడికి కళ్లు కుట్టినయ్. లైసెన్సు కట్టితాను అమ్మేచోటికి లైసెన్సు లేనోళ్ళను రానియ్యొద్దని అర్జీ పెట్టుకున్నాడు. లచ్చలు మూలిగే మార్వాడీకి లైసెన్సు దండగని చూశారేకాని మాబోటి అలగాజనం పాతిక, ముప్ఫయిమంది అల్లాడతారని అధికార్లు సూడలేదు."

"అవునవును. మద్యనిషేధమంటూ పెట్టి సారాకంట్రాక్టర్లకు ఏదో దారి చూపించారు కాని లక్షలకొద్దీ ఉన్న కల్లు గీతగాళ్ళ అతీగతీ చూశారూ?"

"మహ బాగా జెప్పారు. అంతటితో మనం చేసే దేమీ లేక, మనసంతా సంపుకుని ఒకళ్ళింట్లో చాకిరికి కుదిరాను. ఇచ్చే నాలుగు రూపాయలకు పాణాలు తోడెయ్యటమే కాకుండా, సివరికి దొంగతనంకూడా అంటగట్టారు. దాంతో మనబతుకు పోలీసోళ్ళపాలయింది."

"అంటే?"

"యేముంది? యెక్కడేది జరిగినా, ముందు మన గొంతుకే ఉరి. వూళ్ళో ఎక్కడ దొంగతనం జరిగినా, ముందు మనవోళ్లు వాసిపొయ్యేది. అసలు పోయిన వస్తువును ఇంటాయన కొడుకే ఎత్తికెళ్ళి, కిళ్లీకొట్టు బాకీలకింద చెల్లబెట్టాడు. ఈసంగతి ఊరందరికీ తెలుసు. అయితే యేం? కే.డీ. అని పేరుపడ్డ నాకు ఒక్కళ్ళూ పని ఇయ్యలా. వొచ్చినపేరు రానే వచ్చింది. పస్తులుకూడా ఎందుకుండాలని, ఇందులోకి దిగాను."

"మీ వృత్తిలో తరగతులేమయినా ఉన్నయ్యా?"

"ఆ! చాలా ఉండయ్. జేబులు కొట్టటం, బురిడీవేసి బోల్తా కొట్టించటం, బడిపిల్లలని మోసం చేయటం, యీలు దొరికితే దార్లు కొట్టటం, ముటాలుగా చేరి బందిపోట్లు చేయటం–యిట్టాగే ఎన్నోరకాలు ఉండయ్."

"ఇందులో మీకేది ఇష్టం?"

"జేబులు కొట్టటమేనండీ?"

"ఎందుకని?"

"దొంగతనాలన్నిటిలోకీ అది రాజా అయిందిలేండి. ఎంతో జాగర్తగా, మెలుకువగా ఉంటే కాని సెయ్ తిరగదు. అసలు దానికి ఆర్భాటమే అక్కర్లా. కొంచం కళ్లుతెరిసి, కొంచం చెయ్‌మలిపితే సరిదర్జాగా బతకొచ్చు."

"ఆఁ?"

"మరి యేంటనుకున్నారు? జేబులు కొట్టెయ్యటంలో మొనగాడయినాడంటే, ఆడు అందరికీ గురువయినా డన్నమాటే. ఆరితేరిన జేబుదొంగ పులినోట్లో కండను గూడా, దానికి తెలియకుండా తీసుకురాగల్డు."

"జేబులు కొట్టటం వెనకటంత సులభం కాదేమో?"

"అరెరే! యిప్పుడే సులభమయిందండీ. యెనకటిగోజుల్లో డబ్బు ఉందంటే, తలగుడ్డలో వేసికట్టుకోటమో, గొండిన సంచీలో పెట్టటమో, సొక్కాలోపలి జేబులో పెట్టి కుట్టుకోటమో చేసేవోళ్లు. అది కొట్టెయ్యటమంటే భలే కష్టంగా ఉండేది. యిప్పుడేముంది? లాల్చీ జేబులు, యెనక జేబులు, పంట్లాంజేబులు, అసలు జేబే లేకుండా పర్సు సేత్తో బట్టుకొని ఊసులాడుకుంటూ పొయ్యేవాళ్లూ యిప్పుడు శానా చులకనయింది లేండి.

"పైన కోటు తొడుక్కుంటే?"

"హి హ్హి హ్హీ! ఛవరంజేసుకునే బ్లేడ్లున్నయ్ చూశారూ, అవీ, కత్తెర్లూ, అప్పుడు బలేపని జేస్తయ్‌లేండి. మా స్నేయితుడు ఒకడుండాడు. వాడు ఒక బ్లేడ్ తీసుకుని రైళ్ళలో తిరుగుతుంటాడు.

ఓరి నాయినో, వాడి సంపాదన చూస్తే కళ్లు తిరుగుతయ్."

"ఆఁ! అంతవాడా!"

"అవును. మీరు డబ్బు కోటులోపల సాక్కా జేబులో పెడితే, వాడు బ్లేడును ఒక్కసారి పర్రుమనిపిస్తాడు. అంతే. కోటూ, సాక్కా, రెండూ తెగిపోవాల్సిందే. చేతులకు రిస్టువాచీలు పెట్టుకుని కొంచం కళ్లుగూశారూ అంటె, తోలు పటకా సర్రుమని తెగిపోవటం, గడియారాన్ని మావోడు అంచెలమీద పంపించెయ్యటం జరుగుతుంది."

"రైళ్లలో ఆ పని చులకన అవుతుందా యేమిటి?

"అవునండీ, జనంతొక్కిడి ఉంటుందా? టికెట్లకాడ 'క్యూ' లూ 'బో' లూ ఉంటయ్యా? ఒకడి యెనకాల ఒకడు తొక్కుకుంటూ 'క్యూ'లు నడిసేటప్పటికి ఎన్ని జేబులయినా కొట్టొచ్చు. బండి ఎక్కేవోళ్లూ, దిగేవోళ్లూ మనకే సాయపడతారు. అట్టా ప్లేడ్ పెట్టి ఉంచితే వాళ్ళ నడకలోనే పని జరిగిపోతుంది"

"అట్టాచేస్తే పట్టుబడరూ?"

"జేబుకొట్టేవాళ్ళకి అంచెలమిటా ఉంటుంది. కొట్టేసిన వస్తువుని అవతలకి బారెయటానికి వాళ్లు ఉంటారు. ఎప్పుడయినా వీడు పట్టుబడితే జనం కొట్టకుండా చూసి, వీలయితే సర్ది చెప్పి యిడిపిస్తారు. లేకపోతే దెబ్బలు తగలకుండా చూస్తారు.

"బలే పకడ్‌బందుగా జరుగుతుందే ఈ వ్యవహారం! మిగిలిన వ్యవహారా లెట్లా నడుస్తయ్?"

"బురిడీ కొట్టించటంకూడా తమాషాగానే ఉంటుంది. బాంకులదగ్గిరా, 'స్టేషన్లకాడా, పోస్టాపీసుల్లో, సినిమాలదగ్గరా, యిది మహాజోరుగా సాగుద్ది. డబ్బు దగ్గర పెట్టుకుని దిక్కులుచూసే మడిసిని కనిపెట్టి "యిదుగో నయ్యోవ్, తేలు!" అంటాం. ఆయన యెగిరిపడి మళ్ళీచూస్తే, మేమూ ఉండం, ఆయన డబ్బూ ఉండదు. యిట్టాగే యేవో మాటలుపెట్టి యేమారుస్తాం."

"అవును. వెర్రినాగమ్మలు డబ్బు దగ్గరున్నప్పుడు జాగర్తపడకపోతే ఎట్లా?"

"ఇదిగో, యీ తమాషా యినండీ. ఆ మజ్జన అమెరికాలో ఎగిరే సాసర్లు కనిపించినయ్యనిరాశారె, అప్పుడు జరిగిందంట యిది. దచ్చిణ అమెరికాలో ఒకసోట, ఒక రోజున సాలామంది పిచ్చోళ్లుజేరి ఆకాశమంతా సాసర్లకోసం యేగాదిగా చూస్తున్నారంట. అప్పుడు మావాడొకడు ఒకాయనదగ్గర డబ్బున్నట్టు కనిపెట్టి "అదిగదుగో సాసర్ అని అరిచాడంట. ఆ పెద్దమడిసి ఆకాశమంతా ఎతికి నేలమీదికి చూసేటప్పటికి మనవాడు పర్సుతో ఉడాయించాడు.

"మీరు ఆశే చదువుకోలేదే. ఈ సంగతులన్నీ యెట్లా తెలిసినయ్?"

"మన నల్లోడు రాజ్యానికి వచ్చింతరవాత అన్నిటితోపాటు జైళ్లుకూడా బాగుపడ్డయ్ లెండి. యిప్పుడు వాటినిండా సదువుకునోళ్లూ, పెద్ద ఆలోశన్లు చేసేవోళ్లూ యెక్కువగా కనిపిస్తుండారు. అందులో ఒకాయన నాకీ సంగతులన్నీ చెప్పేవాడు. సదవటంకూడా ఆయనే నేర్పాడు."

"సరే, మీ మూడోతరగతి ఎట్లా నడుస్తోంది?"

"బళ్లోకి పొయ్యే పిల్లలదగ్గరికెళ్ళి మిటాయి పెడతామనో, వాళ్ళ అమ్మమ్మ పిలుస్తుందనో చెప్పి మాయపుచ్చి తీసుకెళ్ళేదీ, సొమ్ములు వొల్చుకుని పంపించేది. పొరుగూరువాళ్లు వొచ్చి ఏదయినా అడుగుతారనుకోండీ, వాళ్లని అటుయిటూ తిప్పి, యే సందులోనో నాలుగు వొడ్డించి ఉన్నది ఉడబీక్కోటం- యిట్టాగే అన్నీ."

"నోరులేని పిల్లల్నీ, అమాయకుల్నీ మోసం చేయటం పాపం కాదండీ?"

"హహ్హహ్హా! పాపమేంటండీ? ఈ పెద్దమడుసులంతా చేసేది యేంటి? నేను మూటలు మోసినప్పుడు అనుభవమే. మెడలు యిరిగే బరువుపెట్టి, కనపడ్డ కనకయ్యతో నల్లా బాతాఖానీకొట్టి, సివరికి అణా డబ్బులు యిచ్చేవోళ్లూ. కుర్రవెధవననీ, నోరూ వాయీ లేదనీ నన్ను పిలిచేవోళ్లు కాని, బలం కల పెద్దోడు పక్కనున్నా పిలవరు. వోళ్లు యిరుసుకుని చాకిరిజేసే బిడ్డతల్లి, పిల్లకు పాలిచ్చుకుంటుంటే, కొంప మునిగినట్టుగా రంకెలు పెడతారు అమ్మతల్లులు! బాబూ, పిల్ల పాలులేక సచ్చిపోతుంది. ఒక్క పాలడబ్బా అయినా ఇయ్యండీ' అంటే పెట్టెలకు పెట్టెలు దాసుకుని, అయిపోయినయ్ అంటారు షావుకార్లు. యీళ్లందరికీ లేనిపాపం మాకేనా?"

"నిజమే నువ్వు చెప్పింది. కాదనలేం... అయితే బందిపోట్ల సంగతి యేమిటి?"

"మడిసికి బొత్తిగా తిండిలేకపోతే రెండే పన్లుజేస్తాడు. ఉరి తీసుకుని సావటమో, లేకపోతే సావటానికీ సంపటానికీ సిద్ధపడి తిండి సంపాయించుకోటమో చేస్తాడు"

"అది అబద్ధం. ఆకతాయివెధవల దుర్బోధనలను విన్నవాళ్లు తప్ప ఇంకెవ్వరూ ఆ పని చెయ్యరు."

"కూలినాలిజనమే ఆకతాయోళ్ల మాట ఎందుకు యినాలీ? కంపెనీలనీ, బాంకుల్నీ దివాలాతీయించి లచ్చలాది జనాన్ని ముంచే ఘరానామడుసులూ మీబోటి గొప్పింటోళ్లూ, డబ్బుకోసం యెన్నయినా చేస్తారే; ఆకతాయోళ్ళమాటలు ఎందుకు యినరు?"

"తప్పు కనుక"

"అప్పుడు మీరు చేసేదేంటి? పెళ్లాం బిడ్డల్ని బావిలోతోసి మీరు దూకుతారు. లేదూ - ఉరిపోసుకుని పెళ్లాం బిడ్డల్ని లోకంపాలుచేసి పోతారు. అదీకాకపోతే యీదుల్లో పడతారు అంతేనా?"

రాములు చెప్పింది నసాళానికి అంటింది. ఇంక అతనితో వాదించి లాభంలేదని ఇట్లా అన్నాను.

"నిజమేనండి. మీరు చేసేది మహా గొప్ప సంగతే."

"మరి యేమనుకున్నారు? అందుకనే మన పూర్వీకులు మా విజ్జను అరవైనాలుగు కళల్లోనూ మొదటిదానిగా జమకట్టారు." అని మీసం మెలేశాడు రాములు.

"అయితే మాపత్రికద్వారా ప్రజలకేమయినా సందేశం ఇస్తారా?" అని అడిగాను.

"ఓ! రాసుకోండి. "భారతీయులు అరవైనాలుగు కళల్నీ పోషించి పూర్వీకుల పేరు నిలబెట్టాలి - అది సరేగాని మీకొకవిషయం చెపుతానండీ."

"మా వృత్తిలో షేమహేమీలు ఉన్నారు. వాళ్లని ఉపయోగించుకుంటే ప్రపంచమంతా పట్టం కట్టుకోవచ్చు."

"అది ఎట్లా వీలవుతుంది?"

"జూదాల్లూ, గుర్రప్పందేలూ, పెక్కులేషన్ - యీటిల్లో మావోళ్ళను ఉపయోగించుకుంటే ప్రభుత్వమే చేతికి వొస్తుంది. దానికి అమెరికాలో 'పెషల్ ట్రెయినింగ్' ఇస్తారంట!"

"నిజం?"

"మీతో పరాసికాలా? ట్రెయినింగు అయింతరవాత నాకాడికి రాండి. అంతా నేను నడిపిస్తా. జగత్ ఖిత్తర్ రాములు, కే. డీ. నంబరు వన్ అని అడిగితే, యెవ్వరయినా మిమ్మల్ని నాకాడికి తీసుకొస్తారు... ఇంక సెలవిప్పిస్తారా? మా వూరిబండికి టయిమయింది" అంటూ లేచాడు రాములు.

గనోక్యూర్